రాఘవేంద్రస్వామి సన్నిధిలో నారాయణమూర్తి దంపతులు



బెంగళూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జయనగర్ రాఘవేంద్రస్వామి మఠాన్ని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నారాయణ మూర్తి, సుధామూర్తి దంపతులు బుధవారం సందర్శించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వీరికి మఠం వ్యవస్థాపకుడు ఆర్‌కే వాదింద్రాచార్య, పురోహితుడు కిశోరాచార్య.. స్వామివారి శేషవస్త్రం, అక్షితలు అందజేసి, సత్కరించారు.



ప్యాలెస్‌లో ఆయుధాలకు పూజ చేస్తున్న యువరాజు యదువీర్

యువరాజు ఆయుధ పూజ

● మైసూరు ప్యాలెస్‌లో ముగిసిన ప్రైవేట్ దర్బార్

బెంగళూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు ప్యాలెస్‌లో రాజవంశస్తుల సంప్రదాయమైన ఆయుధపూజ బుధవారం నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా పదోరోజు యువరాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్ సంప్రదాయబద్ధంగా ఆయుధపూజ, వివిధ ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. దేశంలో ఇప్పటికీ రాజపరంపర సంప్రదాయాలు ఆయుధపూజ వంటి కార్యక్రమాలు జరుగుతుండడం మైసూరుప్యాలెస్‌లో మాత్రమే. ఉదయం 6 గంటల నుంచే చండికా హోమం ప్రారంభమైంది. 7.30 గంటలకు పట్టపుకత్తి, పలు ఆయుధాలను ప్యాలెస్ (మిగతా 7లో...)




పట్టపు ఏనుగుకు పూజలు చేస్తున్న దృశ్యం



గిరినగర్ వాసవీమాతకు సుఖవాహన అలంకరణ

గవర్నర్, సీఎం దసరా శుభాకాంక్షలు

బెంగళూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రజలకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, సీఎం సిద్దరామయ్య దసరా శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి ప్రతి ఇంటా ఓ సరికొత్త విజయానికి నాంది కావాలని ఆకాంక్షించారు. మైసూరు చాముండేశ్వరీదేవి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ముఖ్యమంత్రి కోరారు. మాజీ ప్రధాని దేవెగౌడ దసరా శుభాకాంక్షలు తెలిపారు. డీసీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రులు కుమారస్వామి, శోభాకరంద్లాజె, ప్రహ్లాద్‌జోషి, సోమణ్ణ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రమంత్రులు ప్రత్యేక సందేశాల ద్వారా శుభాకాంక్షలు తెలిపినవారిలో ఉన్నారు.




విద్యుద్దీపాల వెలుగులో మైసూరు ప్యాలెస్

విద్యుద్దీప కాంతుల్లో.. రాచనగరి..!

నేడు జంబూసవారికి సర్వం సిద్ధం

బెంగళూరు, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక మైసూరు దసరా వేడుకలలో తుది ఘట్టం జంబూసవారికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొన్నిరోజులుగా గజరాజు అభిమన్యు నేతృత్వంలో ఇతర ఏనుగులచే రిహార్సల్స్ విడతలవారీగా పూర్తయ్యాయి. ఇసుక బస్తాలతో, కొయ్య అంబారితో తర్ఫీదు ఇచ్చారు. గురువారం నాడదేవత చాముండేశ్వరిదేవిని బంగారు అంబారిపై ఊరేగించనున్నారు. పురవీధులలో సాగే జంబూసవారిని వీక్షించేందుకు దేశవిదేశాలనుంచి సందర్శకులు విచ్చేశారు. సాయంత్రం దివిటీల ప్రదర్శన ఉంటుంది. ముగింపు కార్యక్రమానికి గవర్నర్ విచ్చేయనున్నారు. యువ దసరా, రైతు దసరా, క్రీడా దసరా, ఫ్లవర్ షోలే కాకుండా ఏడెనిమిది వేదికలద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చాగోష్టులు, కవిగోష్టులు సాగాయి. మరోవైపు మైసూరు ప్యాలెస్‌లో రాచరిక సంప్రదాయాలకు అనుగుణంగా పలు ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. ఇదే తొలిసారి డ్రోన్ షో, ఎయిర్‌షో నిర్వహించగా సందర్శకులలో హర్షం వ్యక్తమైంది. 3వేల డ్రోన్లతో జాతీయజంతువు పులి నమూనా రూపొందించడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. మరోవైపు బృందావన్ గార్డెన్స్‌లో గంగా హారతి తరహాలో కావేరి హారతి నిర్వహించగా సందర్శకులు పులకించారు. అన్నింటికి మించి లక్ష బల్బులతో మైసూరుప్యాలెస్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అన్ని ప్రముఖ కూడళ్లు, రహదారులను విద్యుద్దీపాలంకరణతో రాచనగరి మైసూరు నగరం శోభాయమానంగా విరాజిల్లుతోంది. ఈ అలంకరణలు, వేడుకలు చూసేందుకు రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశవిదేశాలనుంచి విచ్చేస్తున్నారు.







జంబూసవారి వీక్షించేందుకు సందర్శకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

విద్యుత్ వెలుగుల్లో మైసూరు నగరం

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

మహాత్మా గాంధీ (జయంతి)




'జాతిపిత' మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ 1869 అక్టోబరు 2న గుజరాత్ రాష్ట్రం పోర్‌బందర్‌లో జన్మించారు. సత్యం, అహింస ఆయన సిద్ధాంతాలు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహంతో ప్రజలను చైతన్యపరిచి దశాబ్దాలపాటు పోరాటం చేసి బ్రిటీష్‌వారిని గడగడలాడించి ఎట్టకేలకు దేశానికి స్వాతంత్ర్యం సాధించారు. 'మహాత్మా'గా పిలవబడ్డారు. దేశనాయకులలో అగ్రగణ్యులుగా నిలిచారు. 1948 జనవరి 30న హత్యకు గురయ్యారు. కాగా 20వ శతాబ్దంలో మానవాళిని అత్యధిక ప్రభావితం చేసిన నాయకులలో ఒకరిగా నిలిచారు.

లాల్ బహద్దూర్ శాస్త్రి (జయంతి)



'జై జవాన్ - జై కిసాన్' నినాదంతో చైతన్యం తెచ్చిన లాల్ బహద్దూర్‌శాస్త్రి 1904 అక్టోబరు 2న ప్రస్తుత ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం పండిత్ దీన్‌దయాళ్‌నగర్ ప్రాంతంలో జన్మించారు. మహాత్మాగాంధీజీ స్ఫూర్తితో స్వాతంత్రోద్యమంలో పాల్గొని లోక్‌సేవా మండల్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1964 నుంచి 1966 వరకు దేశ రెండో ప్రధానమంత్రిగా వ్యవహరించారు. అంతకుముందు వివిధ శాఖలకు కేంద్రమంత్రిగా వ్యవహరించి క్షీర విప్లవానికి శ్రీకారం చుట్టి జాతీయ డైరీ బోర్డును ఏర్పాటు చేశారు. 1965లో ఇండో-పాక్ యుద్ధానికి దేశం తరఫున నాయకత్వం వహించారు. 1966 జనవరి 11న కన్నుమూశారు. మరణానంతరం ఆయనకు 'భారత రత్న' ప్రకటించారు.

గ్రౌచో మార్క్స్ (జయంతి)



అమెరికా దేశానికి చెందిన కమెడియన్, జూలియస్ హెన్రీ గ్రౌచో మార్క్స్ 1890 అక్టోబరు 2న జన్మించారు. రచయితగానే కాకుండా రేడియోలోనూ, బుల్లితెరపైనా, వెండితెరపైనా నటుడిగా రాణించారు. 13 ఫీచర్ ఫిల్మ్స్‌తో గుర్తింపు పొందారు. కళ్ళద్దాలు, ముక్కు, నుదురు, సిగార్... భిన్నమైన రూపంతో తనదైన శైలితో ఆకట్టుకున్నారు. 1977 ఆగస్టు 19న కన్నుమూశారు.

హంగ్‌పన్ దాదా (జయంతి)




హవల్దార్ హంగ్‌పన్ దాదా 1979 అక్టోబరు 2న అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం తిరప్ జిల్లా బోర్దురియా గ్రామంలో జన్మించారు. 1997లో ఆర్మీలో చేరారు. అనంతరం అస్సోం రెజిమెంట్‌కు బదిలీ అయ్యారు. 36వ యేట 2016 మే 26న కశ్మీర్‌లో ముగ్గురు తీవ్రవాదులను మట్టుపెట్టి, ఒకరిని గాయపరిచాడు. చివరకు తీవ్ర గాయాలతో మే 27న కన్నుమూశారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం 2017 రిపబ్లిక్ డేన 'అశోకచక్ర' ప్రకటించారు.

సీడీ దేశ్‌ముఖ్ (వర్ధంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత 'సర్' చింతమన్ ద్వారకనాథ్ దేశ్‌ముఖ్ 1896 జనవరి 14న మహారాష్ట్రలోని రాయ్‌ఘడ్ జిల్లాలో జన్మించారు. 1943లో బ్రిటీష్‌వారిచే ఆర్‌బీఐ గవర్నర్‌గా నియమితులైన తొలి భారతీయుడు. 1944లో 'నైట్ హుడ్'గా గౌరవం అందుకున్నారు. 1950-56 మధ్య కేంద్ర ఆర్థికమంత్రిగా వ్యవహరించారు. యూజీసీ చైర్మన్‌గా, ఢిల్లీ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. రామన్ మెగసెసె అవార్డు గ్రహీత. ఐఎంఎఫ్, ఐబీఆర్‌డీ ఏర్పాటుకు కారకులు. కాగా స్వాతంత్ర్య సమర యోధురాలు, రచయిత్రి అయిన దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ను వివాహమాడారు. ఆర్థికవేత్తగా పలు గౌరవ పురస్కారాలు అందుకున్నారు. 1982 అక్టోబరు 2న కన్నుమూశారు.

కామరాజ్ నాడార్ (వర్ధంతి)



కుమారస్వామి కామరాజ్ నాడార్ 1903 జూలై 15న విరుద్‌నగర్‌లో జన్మించారు. నిరుపేద కల్లుగీత కుటుంబంలో జన్మించి ప్రజల కోసమే జీవితాన్ని అంకితం చేసి పెళ్లి కూడా చేసుకోలేదు. దేశ రాజకీయాలలో 'కింగ్ మేకర్'గా రాణించి లాల్ బహద్దూర్‌శాస్త్రి, ఇందిరాగాంధీలు ప్రధాని అయ్యేందుకు పాటుపడ్డారు. 1954 నుంచి 1963 వరకు తమిళనాడు ముఖ్యమంత్రిగా కొనసాగారు. గ్రామాలలో ఉచిత విద్య, ఉచిత మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసి నేటికీ ప్రశంసలు అందుకుంటున్నారు. 1975 అక్టోబరు 2న కన్నుమూశారు. మరణానంతరం 'భారతరత్న' ప్రకటించారు.

హాసన్ జిల్లాలో పేలుడు

● దంపతుల దుర్మరణం



సుదర్శన్, కావ్య (ఫైల్)

బెంగళూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): హాసన్ జిల్లా ఆలూరు తాలూకా హళెఆలూరు గ్రామంలో సంభవించిన పేలుడుతో దంపతులు దుర్మరణం చెందారు. మంగళవారం రాత్రి 8.30 గంటలకు ఇంటి బయట పేలుడు తీవ్రతకు ప్రహరీ కూలిపోయి ఇంట్లో వస్తులు చెల్లాచెదురయ్యాయి. భార్యాభర్తలతోపాటు ఓ చిన్నారి తీవ్రంగా గాయపడ్డారు. ఇంటిలోపల మరోగదిలో ఉన్న ఇద్దరు చిన్నారులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన సుదర్శన్ ఆచార్(40), ఆయన భార్య కావ్య (28) మృతి చెందారు. వీరిలో సుదర్శన్ మంగళవారం రాత్రి మృతి చెందగా, బుధవారం తెల్లవారుజామున కావ్య మృతి చెందారు. సకలేశపుర డీఎస్పీ ప్రమోద్‌కుమార్ బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. తొలుత గ్యాస్ సిలిండర్ పేలుడుగా భావించారు. అయితే బాణాసంచా తయారీకి ఉపయోగించే పేలుడు పదార్థాలే కారణమని ప్రాథమిక పరిశీలనలో నిర్ధారించారు. గ్రామానికి దూరంగా పొలంలో ఇల్లు ఉండడంలో ఏం జరిగిందనేది ఎవరూ గుర్తించలేదన్నారు. కుటుంబ పెద్దలు ఇద్దరూ మృతి చెందడంతో పేలుడుకు గల కారణాలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఎస్పీ మొహ్మద్ సుజిత మాట్లాడుతూ ప్రమాదంపై దర్యాప్తు సాగుతోందన్నారు.

బీదర్ జిల్లాలో మంత్రి పర్యటన





గ్రామాల్లో వరద పరిస్థితిని సమీక్షిస్తున్న అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రె

బెంగళూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అతివృష్టితో విలవిలలాడుతున్న బీదర్ జిల్లాలోని భాల్కి తాలూకా సహా పలు ప్రాంతాలలో అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె బుధవారం పర్యటించారు. సరిహద్దులోని మహారాష్ట్ర మాంజా నది పరీవాహక ప్రాంతాలైన సాయిగావ్, మేహకర, హల్సితూగావ్, వాంజిఖేడ్, కొంగళి తదితర గ్రామాలను పరిశీలించారు. వరద పరిస్థితులపై స్థానిక అధికారులతో మంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించారు. పంటనష్టం అంచనాకు సంబంధించి నివేదిక సమర్పించాలని సూచించారు. జలదిగ్బంధన ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరద ప్రాంతాలలో ముందస్తు చర్యలు చేపట్టి గ్రామస్థులను అప్రమత్తం చేయాలన్నారు. ఇబ్బందులలో ఉన్న రైతులను ఆదుకునేలా అత్యవసరంగా రూ.8,500 పరిహారంతోపాటు నీరావరి భూములకు రూ.25వేలు, బంజరు భూములకు రూ.17వేలు, అంతరపంటలు వేసిన భూములకు రూ.31వేలు పరిహారం ఇచ్చేలా హామీ ఇచ్చారు. దీపావళిలోగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

నేడు తుమకూరులో జంబూసవారి



కొయ్య అంబారితో ఏనుగుల తర్ఫీదు



ప్రశంసాపత్రాలతో వివిధ పోటీల విజేతలు

బెంగళూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా తుమకూరు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం జంబూసవారి జరగనుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొయ్యఅంబారితో ఏనుగుల తర్ఫీదు ముగిసింది. జంబూసవారిలో గజరాజుల వెంట చుట్టుపక్కల 50గ్రామాలకు చెందిన గ్రామదేవతలు ఊరేగింపులో పాల్గొంటాయి. దసరా వేడుకలలో భాగంగా తొలిసారి దివిటీల కవాతులో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, పోలీసు అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేసిన జిల్లా అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందచేశారు. రైఫిల్ షూటింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు హోం మంత్రి పరమేశ్వర్ స్వయంగా పాల్గొని బుధవారం ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు.

మావటీలకు కేంద్రమంత్రి అల్పాహారం



ఓళిగ వడ్డిస్తున్న కేంద్రమంత్రి శోభాకరంద్లాజె



కేంద్రమంత్రితో మావటీల బృందం

బెంగళూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాలలో ప్రతిష్ఠాత్మకమైన జంబూసవారిలో పాల్గొనే గజరాజుల బాగోగులను చూసే మావటీలకు కేంద్రమంత్రి శోభాకరంద్లాజె స్వయంగా అల్పాహారం వడ్డించారు. మైసూరు ప్యాలెస్‌కు బుధవారం విచ్చేసిన ఆమె తొలుత మావటీల కుటుంబీకులకు నూతనవస్త్రాలు, మిఠాయిలు అందజేసి గౌరవించారు. అనంతరం వారికోసం ప్రత్యేకంగా అల్పాహారం ఏర్పాటు చేయగా వారికి స్వయంగా ఓళిగ వడ్డించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ తదితరులు పాల్గొన్నారు.

రాయచూరులో మార్కెట్లు కళకళ



పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి

రాయచూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఆయుధ పూజ, దసరా పండుగలను పురస్కరించుకొని నగరంలోని మార్కెట్ సముదాయాలన్ని వినియోగదారులతో కళకళలాడాయి. బుధవారం ఆయుధ పూజ కోసం గుమ్మడి కాయలు, బంతిపూల కొమ్మలు కొనేందుకు మార్కెట్ కిక్కిరిసిపోయింది. శనివారం నిర్వహించే దసరా (విజయదశమి) పండుగ కొనుగోళ్లతో కూరగాయల మార్కెట్, క్లాత్ బజార్‌లలోని దుకాణాలన్ని కిటకిటలాడాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి తమ వ్యాపారం మంచిగానే సాగుతున్నట్లు పలువురు వ్యాపారులు తెలపడం గమనార్హం.

పరిహారం కోసం రైతుల ఆందోళన

రాయచూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల వల్ల పంటనష్టానికి గురైన రైతులు పరిహారం కోరుతు ఆందోళన బాటపట్టారు. జనతాదళ్(ఎస్) పార్టీ నాయకత్వంలో బుధవారం మాన్వి తాలూకాకు చెందిన వందలాది మంది రైతులు మాన్వి పట్టణంలో రాస్తారోకో చేపట్టి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దాదాపు గంటకు పైగా వాహన సంచారం నిలిచిపోయింది. అనంతరం స్థానిక బసవేశ్వర సర్కిల్ వద్ద రైతులు మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్, గడచిన మూడు రోజులుగా అతి వర్షం వల్ల అనేక పంటలు దెబ్బతిన్నాయని లక్షల రూపాయలు అప్పు చేసి పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగీఆ నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పంటనష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందజేయాలని కోరుతు మాన్వి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

కల్యాణ కర్ణాటకకు ప్రభుత్వం రూ.500 కోట్లు ఇవ్వాలి

● విధాన మండలి ప్రతిపక్ష నాయకుడు నారాయణస్వామి

రాయచూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల పంటనష్టానికి గురైన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని విధాన మండలి ప్రతిపక్ష నాయకుడు నారాయణస్వామి చలువాది డిమాండ్ చేశారు. ఒక రోజు జిల్లా పర్యటన కోసం బుధవారం నగరానికి వచ్చిన ప్రతిపక్ష నేత పత్రికల వారితో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంటనష్ట పరిహారం కోసం రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే రూ.9500 కోట్ల ప్యాకేజీ ప్రకటించిందని అయితే పరిహారం మాత్రం తక్షణమే అందించి ఆదుకోవాలన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సహితం బాధ్యత తీసుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పంట నష్టానికి సంబంధించిన సమగ్ర నివేదికను అందజేయాలన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నుంచి పంటనష్ట పరిహారానికి సంబంధించి నిధులు సకాలంలో విడుదల కాకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయన్న నారాయణస్వామి రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో మరింత జాగ్రతగా వ్యవహరించాలన్నారు. కాగా పంటనష్టానికి గురైన రైతులు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గె వద్ద తమ గోడు వెళ్ల బోసుకోగా తన పొలమే నష్టపోయానంటు వారిని మందలించి పంపడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం విషయంలో తొలుత 40 ఎకరాల పంట నష్టానికి గురైన మల్లికార్జున ఖర్గెకు పరిహారం అందజేయాలంటు ఎద్దేవా చేశారు. కాగా ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాల పై రాష్ట్ర పంచాయత్ రాజ్ మంత్రి ప్రియాంక ఖర్గె చేసిన వ్యాఖ్యలను నారాయణ స్వామి ఖండించారు. ఖర్గె వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయని అలాంటి అసభ్య పదజాలాన్ని వాడడం ఆ పార్టీ నాయకులకే చెల్లిందంటు తిప్పికొట్టారు.



మాట్లాడుతున్న నారాయణస్వామి చలువాది

యువరాజు ఆయుధ పూజ

(5వ పేజీ తరువాయి)



పట్టపుకత్తి ధరించి గౌరవ వందనం చేస్తున్న యువరాజు

ముఖద్వారం ద్వారా కోడి సోమేశ్వర ఆలయానికి తీసుకెళ్లారు. పట్టపు ఏనుగు, గుర్రం, ఆవుతోపాటు ఒంటిపల్లకీలో తరలించారు. అక్కడి బావిలోని నీటి ద్వారా ఆయుధాలను శుభ్రం చేశారు. అనంతరం కల్యాణి ప్రాంగణానికి వెనుతిరిగారు. 9.15 గంటలకు చండికాహోమం, పూర్ణాహుతి జరిగింది. ప్యాలెస్ కల్యాణ మండపంలో కత్తితోపాటు పలు ఆయుధాలకు పూజ చేశారు. రాజ లాంఛనాలతో బంగారు పల్లకీకి రాజకుటుంబీకులు పూజలు చేశారు. ప్యాలెస్ ఏనుగులు ప్రీతి, చంచల్‌లకు పూజలు జరిపారు. రాజసంస్థానం ప్రత్యేక గేయాన్ని ఆలపించారు. ఆయుధపూజ తర్వాత బంగారు వజ్రఖచిత సింహాసనాన్ని విడిభాగాలుగా చేశారు. యువరాజు యదువీర్, భార్య త్రిషికా కుమారి నవరాత్రి తొలి రోజున ధరించిన కంకణదారాన్ని బుధవారం తొలగించారు. దీంతో ఈ ఏడాది ప్రైవేట్ దర్బార్‌కు తెరపడినట్టయ్యింది. ఆయుధపూజ సందర్భంగా ప్యాలెస్ ప్రాంగణంలోనే ఉన్న కెప్టెన్ అభిమన్యు, కావేరి, బళ్ళే లక్ష్మి, రూపా, హేమావతి, భీమ, ఏకలవ్య, ప్రశాంత, కంజన్, మహేంద్ర, ధనంజయ, ప్రశాంత ఏనుగులకు పాదపూజ చేసి పూలహారాలు వేశారు. శ్రీకంఠ, ఏకలవ్య అనే ఏనుగులు ప్యాలెస్‌లో ఆయుధపూజలో పట్టపు ఏనుగుగా ఉన్నందున అటవీశాఖ నిర్వహించిన పూజల్లో పాల్గొనలేదు. ప్యాలెస్‌లో దసరా ఉత్సవాలు దాదాపు ముగిసినట్టే. కాగా జంబూసవారిన జమ్మిచెట్టుకు యువరాజు పూజ చేసే సంప్రదాయం ఉంది.

నగరంలో సందడి



మల్లేశ్వరంలోని మారమ్మ ఆలయం వద్ద సందడి

బెంగళూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలలో విజయదశమి ఆచరించడానికి ఒకరోజు ముందు ఆయుధపూజ నిర్వహించడం సంప్రదాయంగా ఉంది. విధానసౌధ సహా ఇతర ప్రభుత్వ కార్యాలయాలలో మంగళవారం ఆయుధపూజ నిర్వహించారు. కాగా పలు ప్రైవేట్‌సంస్థలు, ఫ్యాక్టరీలలో బుధవారం ఆయుధపూజలు చేశారు. ఇళ్లు, వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాలు ఇతర ప్రాంతాలలో తమ వాహనాలకు ఆయుధపూజ చేశారు. నగరంలోని శక్తిదేవతల ఆలయాల ముందు భక్తుల సందడి నెలకొంది. ప్రత్యేకించి బనశంకరిలోని బనశంకరి అమ్మవారు, మల్లేశ్వరంలోని సర్కిల్ మారమ్మ తదితర ఆలయాల వద్ద వాహనాలకు పూజ చేయించేందుకు ప్రజలు బారులుతీరారు. మంత్రి బైరతి సురేశ్ ఆర్‌టీనగర్‌లోని తన కార్యాలయంలో ఆయుధపూజ నిర్వహించారు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేల కార్యాలయాలలోనూ ఆయుధపూజ కొనసాగింది.

ఘనంగా ఆయుధ పూజ



పోలీస్ స్టేషన్‌లో ఆయుధపూజ నిర్వహిస్తున్న ఎస్ఐ పరశురామ్

సిరుగుప్ప, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పరశురామ్ ఆధ్వర్యంలో ఆయుధాల పూజను వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి ప్రధాన అర్చకులు మధ్వాచార్య, శ్యామాచార్యులు ఆయుధాలకు పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీఎం సతీష్, చొక్కా బసవన్నగౌడ, పాలాక్షి గౌడ, కొడ్డి మల్లికార్జున, నరసింహనాయక్, ముత్యాలయ్య శెట్టి, ఎన్‌జీ బసవరాజప్పను సన్మానించారు.



చామరాజపేటలో వాసవీమాతకు శాకంబరి అలంకరణ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1631.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10,520	7,980
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,290	10,005
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	100.00

నేడు కాళికాదేవి రథోత్సవం



రథానికి పూజలు చేస్తున్న అర్చకులు

కంప్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీలో వెలసిన కాళికా దేవి ఆలయంలో అమ్మవారి రథోత్సవం గురువారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. రథోత్సవం సందర్భంగా మంగళవారం రథానికి కలశం ఏర్పాటు చేశారు. ఉదయం పురోహితులు రథానికి పూజలు నిర్వహించారు. ఆలయంలో తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేపడుతూ పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథోత్సవాన్ని ఊరేగిస్తున్నట్లు తెలిపారు. రథోత్సవంలో కంప్లితో పాటు వివిధ గ్రామాల నుంచి భారీఎత్తున భక్తాదులు పాల్గొంటారని తెలిపారు.

అంబేడ్కర్ దీక్షా భూమికి తరలిన నాయకులు



నాగ్‌పూర్ దీక్షాభూమికి తరలివెళుతున్న ప్రజలు

సిరుగుప్ప, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో అంబేడ్కర్ దీక్ష భూమికి తాలుకా ప్రజలు తరలివెళ్లారు. తాలుకా సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ మడ్డేరు సిద్దయ్య కార్యక్రమానికి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ మానవతావాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాగపూర్ దీక్షకు బయలుదేరేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ



కుడితిని పోలీస్‌స్టేషన్‌లో పూజలు చేస్తున్న పోలీసులు

కంప్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా మంగళవారం ఆలయాల్లో అమ్మవారికి ముత్తయిదువు మహిళలు ప్రత్యేక పూజలు కార్యక్రమం నిర్వహించారు. కంప్లి, సింధనూరు, కుడితిని, కురుగోడు, సిరిగేరి పోలీస్ స్టేషన్లో తమ సామగ్రికి ఆయుధ పూజలు చేపట్టారు. పట్టణంలో దుర్గాదేవి రూపంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

రస్తా వివాదంపై మంత్రి స్పందన



రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

బళ్లారిరూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో గతనెల 29వతేదీన బళ్లారి ఇన్‌చార్జి మంత్రి జమీర్, మాజీ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాసమస్యల పరిష్కారానికి జనస్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పుల్లూరు సిద్దేష్, ఉప్పర నౌకర్ల సంఘం అధ్యక్షుడు మల్లప్ప 18వ వార్డు పటేల్ నగర్ గురుకృప కాలనీలోని ప్రజారహదారి ఆక్రమణకు గురైందని దానిని తొలగించాలని మంత్రికి వినతిపత్రం అందించారు. డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డు, అనంతపురం రస్తా నుంచి అగ్నిగుండం రోడ్డు వరకు ప్రజలు ప్రయాణించాలని దానిని ఇతర రోడ్లతో సర్దుబాటు చేయాలని విన్నవించారు. దీనిపై మంత్రి, కార్పొరేషన్ అధికారులు ప్రజా రహదారి పట్ల అధికారులు స్పందించి రహదారి స్థలాన్ని పరిశీలించి సంబంధించిన మ్యాపు స్కెచ్లను పరిశీలించారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడుతామని తెలిపారు. ఉప్పర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మల్లప్ప, సామాజిక కార్యకర్త సిద్దేష్ పాల్గొన్నారు.

వార్డుల్లో బోర్ల ఏర్పాటు



కుడితినిలో ఏసీసీ అదానీ సంస్థ ఆధ్వర్యంలో బోరు వేస్తున్న దృశ్యం

కంప్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో నీటి సమస్య ఉన్న వార్డుల్లో ఏసీసీ అదానీ సంస్థ ముందుకొచ్చి బోర్లను వేయిస్తున్నారు. గతంలో నీటి సమస్యపై ఏసీసీ అదానీ అధికారులతో చర్చించి సీఎస్ఆర్ నిధుల కింద పట్టణంలో బోర్లు వేయించాలని అడగగా అధికారులు నీటి సమస్యను దృష్టిలో వుంచుకుని ముందుకొచ్చి వార్డుల్లో ఉన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరును వేయిస్తున్నారు. ఇప్పటికే కుడితిని పట్టణంలో ఏడు బోర్లను వేయించామని ఏసీసీ అదానీ సంస్థ అధికారులు తెలిపారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా బోర్లు వేయించామని తెలిపారు.



మహిషాసుర మర్దినిగా చిన్న దుర్గమ్మ



కనకదుర్గమ్మకు బంగారు ముఖ అలంకారం



లలితా పరమేశ్వరి ఆలయంలో విశేష అలంకారం



లక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో గాయత్రీదేవి అలంకారం




సంతానలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి

మహిషాసుర మర్దినిగా
అమ్మవారి దర్శనం

బళ్లారి సిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో పదోరోజు అమ్మవార్లు పలు రూపాల్లో భక్తులకు దర్శన మిచ్చారు. పటేల్‌నగర్‌లోని చిన్నదుర్గమ్మ మహిషాసుర మర్ధిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. కనక దుర్గమ్మకు స్వర్ణముఖ అలంకారం. దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవికి బంగారు ఆభరణాలతో అలంకరించారు. అలంకరణ శుక్రవారం వరకు ఉంటుందని ఆలయ పరిపాలనా అధికారి హనుమంతప్ప తెలిపారు. బెంకి మారెమ్మకు కేసని అలంకారం. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి సంతానలక్ష్మిగా, లక్ష్మీవెంకటేశ్వర కల్యామండపంలో గాయత్రిదేవిగా, ఎల్ఎల్‌సీ కాలనీలో లలితాపరమేశ్వరీ అమ్మవారికి విశేష అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు.



సింధనూరు పోలీస్‌స్టేషన్లో ఆయుధపూజ నిర్వహించిన ఎస్ఐ రాథోడ్ కుటుంబం



కంప్లిలో దుర్గాదేవి రూపంలో అమ్మవారు



దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు

బళ్లారిలో దసరా సందడి



కనకదుర్గమ్మ ఆలయం వద్ద బంతిపూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



అరటి పిలకల అమ్మకాలు



సంఘం సర్కిల్ వద్ద పూలు విక్రయిస్తున్న మహిళలు

బళ్లారి సిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో దసరా సందడి నెలకొంది. ఆయుధ పూజ, దసరా వేడుకల సందర్భంగా బుధవారం ఉదయం నగరంలో పూలు, పండ్లు, పూజా సామగ్రి కొనుగోళ్లలో ప్రజలు బిజీ అయ్యారు. ఆయుధపూజ నేపథ్యంలో పూజా సామగ్రి ధరలు పెరిగినప్పటికీ ప్రజలు వాటిని కొనుగోలు చేసేందుకు వెనకాడలేదు. నగరంలోని ప్రధాన రహదారులన్నింటిలోనూ పూలు, పండ్లు విక్రయించేవారితో నిండిపోయింది. విజయదశమి పండుగకు ముందు రోజు ఆయుధ పూజ నిర్వహించారు. ప్రజలు తమ ఇళ్లలోని పనిముట్లు, వస్తువులు, వాహనాలు ఇతర పరికరాలను పూజించారు. బంతిపూలు ధర కేజీ రూ.100, అరటి రూ.100-120 ధర పలికాయి.

పొద్దుతిరుగుడు, వేరుశనగ ఉత్పత్తులు కొనుగోలు చేస్తాం

● కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్

బళ్లారి సిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పథకం కింద 2025-26 సంవత్సరానికి పొద్దుతిరుగుడు, వేరుశనగ ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నట్లు కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ప్రస్తుత సంవత్సరం వర్షాకాలంలో నాణ్యమైన పొద్దుతిరుగుడు, వేరుశనగ ఉత్పత్తుల కొనుగోలుకు సంబంధించి నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎఫ్ఏ క్యూ మద్ధతు పథకం కింద నాణ్యమైన పొద్దుతిరుగుడు, వేరుశనగ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి సండూర్ పట్టణంలోని ఏపీఎంసీ వద్ద కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు సిద్ధం కావాలని నూనెగింజల పెంపకందారుల సహకార సంఘం అధికారులను ఆయన ఆదేశించారు. రైతు పేరు ఆధార్‌కార్డు నంబరు, బ్యాంకు ఖాతాకు మాత్రమే డీబీటీ ద్వారా డబ్బు జమచేస్తారన్న సమాచారాన్ని రైతులకు అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఓంకారయ్య, వ్యవసాయ డైరెక్టర్ సోమసుందర్, సహకార శాఖ రిజిస్ట్రార్ వీరభద్రయ్య, మనోజ్‌కుమార్, గ్రోవర్స్ మార్కెటింగ్ బోర్డు లిమిటెడ్ అయ్యప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పడిపోయిన ఉల్లి ధర


● వారం రోజులుగా ఏపీఎంసీలోనే రైతు ఎదురుచూపు



ఏపీఎంసీ మార్కెట్‌లో ఉల్లి దిగుబడులు

రాయచూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఉల్లిపాయల ధర ఒక్కసారిగా తగ్గిపోవడం రైతులకు నిరాశను మిగిల్చింది. జిల్లాలోని దేవదుర్గ తాలూకా అరకెరాకు చెందిన రైతు ఒకరు వారం రోజుల క్రితం ఉల్లిపాయ పంటను రాయచూరు ఏపీఎంసీ మార్కెట్‌కు తీసుకురాగా ధర పూర్తిగా పడిపోవడంతో వారం రోజులుగా పడియాపులు పడుతున్నాడు. రెండు రోజుల క్రితం నుంచి కురుస్తున్న వర్షాల దెబ్బకు పంటను కాపాడుకునేందుకు ఆయన ఏపీఎంసీ మార్కెట్ యార్డులో నానా అవస్థలు పడుతున్నాడు. లక్షల రూపాయిలు ఖర్చు చేసి పండించుకున్న పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో దసరా పండుగను కూడా సంతోషంగా జరుపుకోలేకపోతున్నట్లు రైతు ఆవేదనతో చెప్పారు. మంగళవారం తన రాసుల మధ్యనే కాలం వెళ్లదీస్తున్న రైతు దసరా పండుగ రోజైనా తనకు మంచి ధర లభిస్తుందేమోనన్న ఆశతో ఎదురు చూస్తున్నాడు.

యంత్రోద్ధారకుడిగా ఆంజనేయుడు



సిరుగుప్ప, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులను పురస్కరించుకుని పదో రోజు పేట ఆంజనేయస్వామికి యంత్రోద్ధారక అలంకారణ చేశారు. సిరుగుప్ప తాలుకా దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన పేట ఆంజనేయస్వామికి అర్చకులు శ్యామాచార్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

మూడు రోజుల్లో సర్వే ముగించిన ఉపాధ్యాయుడు



తహసీల్దార్ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న కృష్ణమూర్తి

రాయచూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వెనకబడిన తరగతుల కమిషన్ ఆదేశం మేరకు రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన సామాజిక, విద్య, ఆర్థిక సర్వేను జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడొకరు రికార్డు టైమ్‌లో పూర్తి చేశారు. మూడు రోజుల్లోగా తనకు కేటాయించిన బ్లాక్‌లో 86 కుటుంబాల వివరాలను సేకరించి తహసీల్దార్ నుంచి ప్రశంసలు అందుకున్నారు. కృష్ణమూర్తి కట్లాట్‌కూరు మోడల్ హయ్యర్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తూ సర్వే అధికారిగా నియమితులయ్యారు. ఆయన మూడు రోజుల్లోనే సర్వే పూర్తిచేసి సమగ్ర వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. దీంతో ఆయన పనితీరు పట్ల సంతోషం, సంతృప్తి వ్యక్తంచేసిన తహసీల్దార్ మంగళవారం సాయంత్రం ఆయనను ఘనంగా సన్మానించి అభినందించి ధ్రువపత్రం అందచేశారు.

ఏళుమక్కల తాయికి విశేష అలంకారం



బళ్లారి సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) నగరంలోని మోతి సర్కిల్ వద్ద వెలసిని ఏళుమక్కల తాయికి బుధవారం విశేషాలంకారంతో పూజలు నిర్వహించారు. 10 వరోజునవరాత్రి కావడంతో భక్తులు వరుసలలో నిలబడి దేవని దర్శించుకుని తరించారు. భక్తులకు అన్న ప్రసాదాలపంపిణీ ఆలయ కమిటీ నిర్వహించింది.

వైభవంగా బతుకమ్మ ఉత్సవాలు



రాఘవేంద్ర కాలనీలో బతుకమ్మ ఉత్సవాల్లో తెలుగు మహిళలు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకం. ప్రతి ఏట భాద్రపద అమావస్య రోజున ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు కొనసాగుతాయి. ఇది ప్రకృతి సంప్రదాయాన్ని మహిళా బలాన్ని ప్రతిబింబించే పండుగగా ప్రత్యేకతను సంతరించుకునింది. ఈ ఏడాది బళ్లారి నగరంలోని రాఘవేంద్ర కాలనీ శబరి లేఔట్‌లో నివసిస్తున్న తెలుగు ప్రజలు బతుకమ్మ పండుగను వైభవంగా నిర్వహించారు. సుధాకర్ ఫైప్స్ వారి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. రంగు రంగుల పూలను వలయాకారంగా పేర్చి బతుకమ్మలా అలంకరించారు. మహిళలు కొత్త బట్టలు, ఆభరణాలు ధరించి బతుకమ్మ చుట్టూ చేరి పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సవాలు జరుపుకున్నారు. అనంతుల మణి, జ్యోతిరూప, వాణి, శాంతి, నాగవేణి, అరుణ, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల సేవ అనన్యం

● కలెక్టర్ కవిత మన్నికేరి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ కవిత మన్నికేరి

బళ్లారి సిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య దృష్ట్యా వైద్యులు సిఫార్సు చేసిన మందులను కచ్చితంగా అందించడం ద్వారా ఆరోగ్య సేవల్లో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న ఫార్మసిస్టుల సేవ అనన్యమైనదని విజయనగరం జిల్లా కలెక్టర్ కవితా మన్నికేరి అన్నారు. నగరంలోని శ్రీవడకరాయ ఆలయ సమీపంలో ఆహార భద్రత,ఔషధ విభాగం నిర్వహించిన ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవ అవగాహన ర్యాలీని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఔషధ పరిశోధన, తయారీ, పంపిణితో సహా అన్ని స్థాయిలలో ఫార్మసిస్టులు కృషి చేస్తున్నారన్నారు. వైద్యులుగా ఫార్మసిస్టులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వివిధ వ్యాదులకు వ్యతిరేకంగా సమర్థవంతమైన మందులను కనగొనడం ద్వారా రోగుల ఆయుర్దాయం పెంచడానికి వీరు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. నగరంలోని వడకరాయ ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ బజార్, గాంధీ సర్కిల్, బస్టాండ్ మీదుగా నగరంలోని పునీత్ రాజ్‌కుమార్ సర్కిల్ వరకు సాగింది. కార్యక్రమంలో తాలూకా వైద్యాధికారి డాక్టర్ వినోద్, డ్రగ్ డీలర్స్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జిల్లా యూనిట్ గౌరవాధ్యక్షుడు ఎం.బసవరాజురెడ్డి, జిల్లాయూనిట్ అధ్యక్షుడు సంతోష్ కుమార్, జిల్లా కార్యదర్శి వాహిద్ తంబ్రహళ్ళి, జిల్లా యూనిట్ ఆఫీస్ బేరర్లు రాజశేఖర్ స్వామి, మల్లికార్జున కొత్తూర్, చిదానందస్వామి, ప్రశాంత్ పూజార్, మంజునాథ్, నగేశ్, ప్రశాంత్, కిరణ్, జావేద్ మహమ్మద్, ప్రకాశ్ పాల్గొన్నారు.

టెలిస్కోప్ తయారీలో విద్యార్థులకు శిక్షణ

బళ్లారి సిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరు కర్ణాటక రాష్ట్ర శాస్త్రీయ పరిశోధనా మండలి రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలలు, అండర్ గ్రాడ్యుయేట్ కళాశాలకు అక్టోబరు 1 నుంచి 9వ తేదీ వరకు ఎనిమిది రోజులపాటు 'నేను శాస్త్రవేత్త 2025' కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇవ్వనుంది. బెంగళూరు గ్రామీణ జిల్లాలోని దొడ్డబళ్లాపూర్ సమీపంలోని బేస్ పార్క్‌లోని స్కౌట్స్ క్యాంప్‌లో ఈ శిక్షణ ఇవ్వనున్నారు. బళ్లారి జిల్లా నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇతర ఆఫీస్ బేరర్‌లతో కలిసి జిల్లాలోని ప్రతి పాఠశాలకు వెళ్లి పిల్లలకు శాస్త్రీయ ఆలోచన, భౌతిక అవగాహన, ఖగోళ వస్తువుల పరిచయం, గ్రహణం తదితర అంశాలను వివరించనున్నారు. వారు పరిశోధన స్వభావం గురించి పిల్లలకు వివరిస్తారు.